# ఇంగ్లీష్ దెయ్యం

'మమ్మీ! మమ్మీ!...' అంటూ అరుస్తోంది ఆరేళ్ళ అర్చన-

'అమ్మాయ్... అమ్మాయ్! ఎవరో వచ్చారట! పాప పిలుస్తోంది అంటూ పూజ గదిలో నుంచి అరిచింది అమ్మమ్మగారు.

'ఎవరే...? ఎవరొచ్చారు? డాడీ ఆఫీసుకు వెళ్లారని చెప్పు...'



గీతా సుబ్బారావు

అంటోంది మమ్మీ... డ్రెస్సింగ్ రూమ్‌లోనుంచి.

'అంకుల్... డాడీ లేరు. ఆఫీసుకు వెళ్ళారు' అని చెప్పింది పాప.

'డాడీ కాదు... ఆంటీకి చెప్పు అన్నాడు అంకుల్.

'మమ్మీ! నీ కోసమే వచ్చాడట! చెప్పింది అర్చన.

'అయితే... కూర్చోమను! వస్తున్నా...' అంది మమ్మీ.

"ఛీ... ఛీ... ఈ పెద్దాళ్ళకి బొత్తిగా బుద్ధి లేదు...' అని విసుక్కుంటూ – పాప లోపలికి వెళ్ళి – చిట్టి చేతులతో బియ్యం తీసుకువచ్చి బిచ్చగాడికి వేసి... తల్లి దగ్గరకు వెళ్ళింది – నవ్వుతూ 'మమ్మీ! బెగ్గర్ అంకుల్‌ని గదిలో కూర్చోపెట్టమంటావేంటి?' అంది.

'ఛీ... నోర్మూయ్! ముష్టోడిని కూడా అంకుల్ అంటావేంటి? అని తిట్టింది మమ్మీ.

'మమ్మీ... నువ్వేగా చెప్పావ్... ఎవరినైనా అంకుల్ అని పిలవాలని! నన్ను తిడతావెందుకూ?' అని అడిగింది అర్చన.

చెంప మీద ఛెళ్ళున కొట్టినట్టు ఫీలయ్యింది మమ్మీ.

'ఆంటీ... ఆంటీ...! అంటూ పిలిచింది ఓ అమ్మాయి.

అత్తగారు వచ్చి తలుపు తీసింది.

పంజాబీ డ్రస్సు... బాబ్డ్‌హెయిర్... భుజానికి హ్యాండ్ బ్యాగ్... ఆ అమ్మాయిని చూసి అత్తగారు 'ఎవరమ్మా... నువ్వు?' అని అడిగింది.

'నా పేరు మేఘన. లక్ష్మి ఆంటీ ఉందా?' అని అడిగింది ఆ అమ్మాయి.

'అమ్మాయ్... నీ కోసం ఎవరో వచ్చారు' అంది అత్తగారు.

'కూర్చోమనండి... వస్తున్నా!' అంది వంట గదిలో నుంచి కోడలు.

'కూర్చో అమ్మా...' అంటూ అత్తగారు లోపలికి వెళ్ళిపోయింది.

లక్ష్మి వంటగదిలో పొయ్యిమీద పాలు దించేసి – గదిలోకి వచ్చింది – ఆ అమ్మాయి సోఫాలో కూర్చొని... టీవీ చూస్తోంది.

'ఎవరూ...' అంది లక్ష్మి.

'లక్ష్మి ఆంటీ నువ్వేనా?' అడిగింది ఆ అమ్మాయి.

'అవును నేనే!' అంది లక్ష్మి

'నన్ను అరుణా ఆంటీ పంపింది! మీకు పనిమనిషి కావాలని చెప్పింది. ఏమిస్తావ్?' అని అడిగింది.

'ఏం ఇవ్వమంటావ్?'

'ఏం పని సెయ్యాలో చెప్పు! పనిని బట్టి రేటు చెప్తా.

'ఇంటి పని మొత్తం చెయ్యాలి! అంది లక్ష్మి.

'మరి నువ్వేం పని చేయవా?' అడిగింది ఆ పిల్ల.

'నేను పనిచేస్తే నువ్వెందుకూ?' అంది లక్ష్మి.

'నేను గిన్నెలు తోముతా... నువ్వు కడగాల! నేను ఇల్లు ఊడుస్తా... నువ్వు తుడవాల! నేను ఈది గుమ్మం కడుగుతా... నువ్వు ముగ్గు వెయ్యాల! ఇట్టా అయితే ఓ రేటు, మొత్తం నేనే చెయ్యాలంటే ఓ రేటు. నేను ఆదివారం రాను. హాలిడే. మీ ఇంటికి చుట్టాలొస్తే ఎగ్స్ట్రా పైస లియ్యాలి!' అంటూ చెప్తోంది ఆ పిల్ల.

అంతలో లోపల్నుంచి అత్తగారు వచ్చింది. ఆవిడ ఉండగా పనిమనిషితో మాట్లాడడం మంచిదికాదు అనుకుంది లక్ష్మి.




'ఎవరే... ఆ అమ్మాయి?' అడిగింది అత్త గారు.

'ఎదురింటి వాళ్ళ పనిమనిషి' చెప్పింది లక్ష్మి.

'పనిమనిషా? నిన్ను ఆంటీ అంటుందే మిటే...?'

'ఇక్కడ సిటీలో అంతేనండీ...'

'ఏమిటే నీ బొంద... సిటీ అయితే... వావి వారసలు... మర్యాదలూ ఉండవా? చక్కగా నోరారా అమ్మగారూ... అనలేదా?' అంది అత్త గారు.

'లక్ష్మి ఆంటీ' అంటూ ఎవరో గట్టిగా అరుస్తున్నాడు. 'వాడెవడో... నిన్నే పిలుస్తున్నాడులా ఉంది! వాడెవడు?' అంది అత్తగారు.

'కూరగాయలవాడు!' అంది లక్ష్మి భయపడుతూ.

'ఛీఛీ! నిన్న ఆటోవాడు ఆంటీ అన్నాడు - ఇవాళ పనిమనిషీ ఆంటీ అంది! ఇప్పుడు కూరగాయలవాడు ఆంటీ అని పిలుస్తున్నాడు...' పెద్దరికం... చిన్నరికం లేదు! మర్యాద లేదు... ఒరేయ్... అబ్బాయ్... నాకు రైలు టిక్కెట్టు తెప్పించు... మా ఊరికి పోతాను...' అంది అత్తగారు.

పక్కగదిలో డ్రస్ చేసుకుంటున్న లక్ష్మి మొగుడు నవ్వుకుంటూ... తల్లి దగ్గరకు వచ్చి... సోఫాలో కూర్చున్నాడు.

'అమ్మా! మన ఊళ్ళో బొత్తిగా నీళ్లు లేవుట! నీకు స్నానం, పూజా సరిగా జరగదు! సరేనా!? అన్నాడు నవ్వుతూ.

'ఖర్మ... బ్రహ్మంగారు ఎప్పుడో కాలజ్ఞానంలో ఇవన్నీ చెప్పార్లే! కలియుగం...' అంటూ సోఫాలో కూలబడింది అత్తగారు. ఆ ఇంగ్లీషు దొరలుపోయినా... వాళ్ళ భాష మనల్ని దెయ్యంలా పీక్కుతింటోంది - అని గొణుక్కుంది.

ఇంతలో 'ఆంటీ ఇస్త్రీకి బట్టలు ఇస్తారా?' అని అరుపు.

అత్తగారు కొరకొరా చూసింది.

కొడుకు ముసిముసి నవ్వులు నవ్వాడు.

కోడలు బిరబిరా లోపలికి వెళ్ళిపోయింది. ●